క్లుప్తంగా

పుస్తకాలు పంపిణీ



అంగన్‌వాడీ కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీవో విమలారాణి

పాతపట్నం: అంగన్‌వాడీల్లో చిన్నారులకు విజ్ఞానం పెంపొందించడానికి, అంగ్లంపై పట్టు సాధించడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాతపట్నం ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి అన్నారు. పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పీపీ-1, పీపీ-2 కిట్లును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు నుంచి నాలుగేళ్ల చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన పుస్తకాలు, నాలుగేళ్ల నుంచి ఐదేళ్లు వయస్సు కలిగిన చిన్నారుల కోసం ఉపయోగపడే పుస్తకాలు (పీపీ-2 కిట్లు) పాతపట్నం, మెళియాపుట్టి మండలంలోని 8 సెక్టార్లలో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనూరాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం



వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామస్తులు

ఆమదాలవలస: మండలంలోని బెలమాం గ్రామానికి చెందిన అదపాక దేవీవరప్రసాద్ అనే విద్యార్థికి గ్రామస్తులు వైద్య ఖర్చులు కోసం ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. దేవి ప్రసాద్‌కు ప్రమాదవశాత్తు సైకిల్ హ్యాండిల్ బలంగా తగలడంతో గుండెకు ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థి తల్లిదండ్రులు పేదవారు కావడంతో సర్పంచ్ కె.కిషోర్ ఆధ్వర్యంలో లొద్దలపేట బెలమాం గ్రామస్తులు రూ.60 వేల ఆర్థిక సాయం గ్రామంలో శుక్రవారం అందించారు.


కంప్యూటర్ విద్యతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీవీఈవో తవిటినాయుడు

ఆమదాలవలస: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా వృత్తి విద్యా అధికారి (డీవీఈవో) ఎస్.తవిటినాయుడు అన్నారు. పట్టణంలోని న్యూ ఇమాన్యుల్ కంప్యూటర్ సెంటర్‌ను శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంప్యూటర్, సాంకేతిక విద్యతో కలిగే లాభాలను వివరించారు. అలాగే కేంద్రంలో సర్టిఫికెట్లు, విద్యార్థులకు అందిస్తున్న కోర్సులపై ఆరా తీశారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్, కళాశాల అధ్యాపకులు ఎస్.దుర్గారావు, పి.ప్రసన్న కుమార్, కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు పొన్నాడ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా శుక్రవారం జరిగింది. దీనిలో భాగంగా అధ్యక్షుడిగా కరణం మురళీమోహనరావు, గౌరవ సలహాదారుడిగా ఎ.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.చంద్రబాబునాయుడు, ఎం.రోహిణి, ప్రధాన కార్యదర్శిగా జి.కల్యాణబాబు, కోశాధికారిగా బలివాడ కిరణ్‌కుమార్, జిల్లా బాధ్యులుగా ఎం.అమర్నాథ్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రమేష్, ఆర్.హితేంద్రకుమార్, అప్పలరాజు, జాయింట్ సెక్రటరీలుగా కనకమహాలక్ష్మి, కె.రాంబాబు, ఈ.రాజేష్‌లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

బెల్టు షాపులపై దాడులు



పాన్‌షాపుల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తూరు: మండలంలోని సిరువాడ, కుంటిభద్ర గ్రామాల్లో బెల్టు షాపులపై స్థానిక ఎస్‌ఐ అమీర్ అలీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు శుక్రవారం నిర్వహించారు. కిరాణా, పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కుంటిభద్ర గ్రామానికి చెందిన అగతయూడి రాజారావు వద్ద ఎనిమిది మద్యం బాటిళ్లు దొరకడంతో కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూటమిపై కన్నెర్ర..!



మడపాం టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు

- వైఎస్సార్‌సీపీ రైతు పోరు విజయవంతం
- తరలివెళ్లిన రైతులు, నాయకులు, కార్యకర్తలు

నరసన్నపేట: రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై అన్నివర్గాల ప్రజలు కన్నెర్ర చేశారు. పనులన్నీ పక్కనబెట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రైతుపోరు కార్యక్రమానికి శుక్రవారం తరలివెళ్లారు. గడిచిన మూడు రోజులుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఈ ర్యాలీకి సంబంధించి ఏర్పాట్లు చేశారు. దీంతో నరసన్నపేట నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, రైతులు తరలివెళ్లారు. మడపాం టోల్‌గేట్ వద్ద అందరూ కలుసుకొని, అక్కడ నుంచి కారులు, ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా శ్రీకాకుళం కలెక్టరేట్‌కు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట సర్పంచ్ బూరెల్ల శంకర్, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, ముద్దాడ బైరాగినాయుడు, చింతు రామారావు, నక్క తులసీదాస్, కణిత కృష్ణ, బొబ్బాది ఈశ్వరరావు, బగ్గు రమణయ్య, చింతల వెంకటరావు, మొజ్జాడ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రాలేదు



అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇంటింటికీ వచ్చి సూపర్ సిక్స్ పేరిట కరపత్రాలు పంపిణీ చేశారు. అయితే తీరా అధికారం వచ్చాక కనీసం ఊసెత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు మూడు విడతల్లో వచ్చాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రాలేదు. దీంతో ఖరీఫ్ సమయానికి ఆర్థిక ఇబ్బందులు పడ్డాం.

– అరవల ఆదినారాయణ, పోతయ్యవలస, నరసన్నపేట

హామీలు నెరవేర్చడంలో విఫలం



సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైంది. ఆరు నెలలు గడిచినా ఇంకా హామీల అమలుకు నోచుకోవడం లేదు. అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఎంతగానో ఎదురు చూశారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు సక్రమంగా పంపిణీ చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రైతులకు తీరని అన్యాయం చేసింది.

– కనుసు సీతారాం, కొమనాపల్లి, నరసన్నపేట

అప్పుల పాలయ్యారు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. దీంతో పంట పెట్టుబడి సాయం అందక రైతులు అప్పులపాలయ్యారు. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోయాయి. ప్రభుత్వం ఇప్పటివరకు పథకం గురించి ప్రస్తావన తీసుకు రాకపోవడం సరికాదు. ఇప్పటికైనా పథకం అమలుకు చర్యలు తీసుకోవాలి. అలాగే రైతులకు ఎంతగానో ఉపకరించే బీమా పథకాన్ని కూడా ఎత్తేశారు. రైతువాటా చెల్లించక పోవడంతో రైతులపై భారం పడుతోంది.

– సురంగి నర్సింగరావు, చింతువానిపేట, నరసన్నపేట

నిరసనకు వెళ్తున్న చింతాడ రవికుమార్ తదితరులు



అన్నదాతకు అండగా..

ఆమదాలవలస: అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌కు ఆమదాలవలస నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులతో ఆయన బయల్దేరి వెళ్లి నిరసనలో పాల్గొన్నారు.

రైతుపోరులో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రైతు పోరులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన రైతు పోరు ఆందోళన కార్యక్రమంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆమెతో పాటు పార్టీ నాయకులు కలమట రమేష్, బి.నారాయణ మూర్తి, కె.జానకమ్మ, ఏవీ సురేష్, ప్రవీణ్, ఈగల చిన్నారావు, చింతాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైతు పోరుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొత్తూరు: జిల్లా కేంద్రంలో నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి కొత్తూరు మండలం నుంచి పార్టీ నాయకులతో పాటు రైతులు అధిక సంఖ్యలో వెళ్లారు. కూటమి ప్రభుత్వం అన్నదాతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు కలమట రమేష్‌బాబు, సూర్యనారాయణ, జెడ్పీటీసీ కామక భాగ్యలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు ఏఎంసీ మాజీ డైరెక్టర్ వడమ శ్రీనివాసరావు, సర్పంచ్ నాస బాలకృష్ణ, సొంట్యాన తమ్మినాయుడు, పిన్నింటి శేషగిరి, లింగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్‌ఖాన్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఆమదాలవలస: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. మండలంలోని శ్రీనివాసచార్యులపేట రైతుసేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టి, మద్దతు ధర దక్కేలా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు వెళ్లే ట్రక్ షీట్లను సకాలంలో పూర్తి చేసి అందించాలన్నారు. తేమశాతం పేరుతో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోళ్లపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, రైతులు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశీలనలో పంచాయతీ సెక్రటరీ బగాది నాగరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శిక్షణ తరగతులు

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 16వ తేదీ నుంచి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16, 17వ తేదీల్లో సుస్థిర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు తప్పకుండా హాజరవ్వాలని సూచించారు.

జలుమూరు: మండల పరిధిలోని 40 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సోమవారం నుంచి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నామని ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. ఇందులో మొదటి బ్యాచ్ 16, 17 తేదీల్లో శ్రీముఖలింగం, నగిరికటకం, కొమనాపల్లి, మర్రివలస, తిమడాం, పర్లాం, జలుమూరు, అందవరం, అల్లాడ, సైరిగాం, గొటివాడ, యలమంచిలి గ్రామాలకు సంబంధించి, 18, 19 తేదీల్లో తలతరియా, జోనంకి, సుబ్రహ్మణ్యపురం, చల్లవానిపేట, లింగాలవలస, రాణ, పెద్దదూగాం, రావిపాడు, టెక్కలిపాడు, కరవంజ, పాగోడు, అక్కురాడు పంచాయతీలకు సంబంధించినవారికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న గ్రామస్తులు

పొందూరు: పొందూరు మండలంలోని పిల్లలవలస గ్రామంలో ఇబ్బందుల్లో ఉన్న రజక కుటుంబాన్ని ఆ గ్రామస్తులు ఆర్థికంగా ఆదుకున్నారు. 20 ఏళ్లుగా నమ్మకంగా కులవృత్తి చేసుకుంటున్న దాలినాయుడు ఇటీవల కిడ్నీవ్యాధికి గురయ్యాడు. ఫలితంగా కుమార్తె వివాహానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో గ్రామంలో యువకులు రూ.60 వేలు విరాళాలు సేకరించారు. నగదును శుక్రవారం సర్పంచ్ దాలినాయుడు చేతులు మీదుగా అందజేశారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



హిరమండలం: మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమంతరావు



జలుమూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు



నరసన్నపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

నరసన్నపేట: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. నరసన్నపేట డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 12 నీటి సంఘాలు ఉండగా, 85,034 మంది ఓటర్లు ఉన్నారన్నారు. దీంట్లో గుండువలస, నడగాం, లుకలాం, ఉర్లాం, సత్యవరం, కోమర్తి, కిల్లాం, ఈదులవలస, మబగాం, యాట్లబసివలస, ఉర్జాం, పోలాకి నీటి సంఘాలు ఉన్నాయి. ఈ మేరకు ఎన్నికల అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సంఘాల ఎన్నిక ముగుస్తుందన్నారు. సమావేశంలో వంశధార డీఈ సురేష్, టీడీలు కృష్ణ, శరత్, ఈవోపీఆర్డీ రేణుక, ఎంఈవో శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని 18 సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఓటర్లు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకురావాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదని స్పష్టం చేశారు.

జలుమూరు: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని తహసీల్దార్ జెన్ని రామారావు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయనతో పాటు జేఈఈలు కిరణ్, భాను, ఎం.శ్రీనివాసరావు, కె.ధనుంజయ, ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

హిరమండలం: మండలంలోని 10 నీటి సంఘాలకు ప్రశాంతంగా ఎన్నికలు జరపాలని తహసీల్దార్ హనుమంతరావు, ఎస్ఐ మహ్మద్ యాసీన్‌లు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

సేంద్రీయ కూరగాయలతో ఆరోగ్యం

జలుమూరు: సేంద్రీయ కూరగాయాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని శ్రీముఖలింగం అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ-4 కేంద్రంలో పోషణ వాటికలో సేంద్రీయ కూరగాయలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆకుకూరలు, వంగ, బెండ, ముల్లంగి తదితర వాటిని పండించి, వాటిని నిత్యం వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు చంద్రకళ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం ప్రారంభమెన్నడో..?



పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన బాలికల వసతి గృహాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని విద్యార్థినులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు రూ.12 కోట్ల రూసా నిధులతో అదనపు తరగతి గదులు, బాలురు, బాలికల వసతి గృహాల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కళాశాల అదనపు గదులు, బాలుర వసతి గృహం ప్రారంభించారు. కానీ బాలికల వసతి గృహం పనులు పూర్తయ్యినప్పటికీ ఇంకా ప్రారంభించలేదు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– పాతపట్నం

మరమ్మతులు చేయరూ..?



బూర్జ మండలంలోని డొంకలపర్త గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రం వద్ద గల బోరు (చేతి పంపు) పాడైపోయింది. దీంతో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గత కొన్ని నెలలుగా బోరు పాడైపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. అధికార్లు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

– బూర్జ

- రైతు బజారు లేకపోవడంతో అవస్థలు
- రోడ్డే కేంద్రంగా క్రయ, విక్రయాలు
- కొనసాగుతున్న దళారీల దందా
- వర్షం వస్తే తప్పని నష్టాలు

రైతు బేజారు..!



బత్తిలి రోడ్డులో వేకువజామున కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

కొత్తూరు: కొత్తూరు మండల కేంద్రం కూరగాయాల క్రయ, విక్రయాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. అయితే ఇక్కడ రైతు బజారు లేకపోవడంతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం మండలాలకు చెందిన వందలాది మంది రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఈ నాలుగు మండలాలకు చెందిన రైతులు కొత్తూరులో కూరగాయాలను విక్రయిస్తారు. కొత్తూరు మార్కెట్ నుంచి పాలకొండ, శ్రీకాకుళం, పలాస, సోంపేట, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, కాశీనగర్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన మార్కెట్లకు రోజుకు సుమారు 20 టన్నులు కంటే ఎక్కువ కూరగాయలను వర్తకులు తీసుకెళ్తుంటారు.

వేకువజాము నుంచే అమ్మకాలు

రోజుకు టన్నుల కొద్ది కూరగాయాలను రైతులు కొత్తూరుకు ప్రతిరోజూ వేకువజాము 3 గంటలకే తీసుకొస్తారు. అయితే ఇక్కడ రైతు బజారు లేకపోవడంతో స్థానిక నాలుగు రోడ్ల కూడలి బత్తిలి రోడ్డు మీద పెట్టి అమ్మకాలు చేస్తుంటారు. తెల్లవారితే షాపులు తీస్తే రోడ్డు మీద వాహన రాకపోకలు ఎక్కువ అవుతాయి. అందువలన తెల్లవారేసరికే రైతులు దళారీలు అడిగిన రేట్లుకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కూరగాయాలు నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో ఇదే అదునుగా వ్యాపారులు తమకు నచ్చిన రేటుకు కొనుగోలు చేస్తున్నారు. వర్షం కురిసినట్లయితే ఆ రోజు రైతులు పడే కష్టాలు వర్ణనాతీతం. కొన్ని రకాల కూరగాయలు అమ్ముడవ్వకపోతే రోడ్డుమీదే పారేయాల్సిన పరిస్థితి ఉటుంది. మరోవైపు రోడ్డుమీద అమ్మకాలు వలన ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. అందువలన ఈ సమస్యలను పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు స్పందించి కొత్తూరులో రైతు బజారు ఏర్పాటు చేయాలని అందరూ కోరుతున్నారు.


అడిగిన ధరలకు ఇవ్వాల్సిందే



రైతు బజారు లేకపోవడంతో కూరగాయాలు నిల్వ చేసుకోవడానికి అవకాశం లేదు. ఇదే అదునుగా చేసుకొని చాలామంది వ్యాపారులు తక్కువ ధరలకు కూరగాయలను అడుగుతుంటారు. తప్పనిసరి పరిస్థితిలో వ్యాపారులు అడిగిన ధరలకే విక్రయిస్తున్నాము. తక్కువ ధరల వలన చాలాసార్లు నష్టపోతున్నాం.

– బలరాము పాత్రో, కూరగాయల రైతు, సిరుసువాడ, కొత్తూరు

రోడ్డు మీదనే విక్రయాలు



రైతు బజారు లేకపోవడంతో రోడ్డు మీద బజారు చేయాల్సి వస్తోంది. తెల్లవారే సరికి కూరగాయలు అమ్ముకోవాలి. లేకపోతే కొనేవారు ఉండరు. దాచుకునేందుకు స్టోరేజీలు లేకపోవడంతో మార్కెట్ ధర కంటే తక్కువ ధరలకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి రైతు బజారు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– లోతుగెడ్డ రాంబాబు, కూరగాయల రైతు, కొత్తూరు

కేజీబీవీ పరిశీలన

కొత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. వంట గదిలో వంటకు ఉంచిన ఉల్లిపాయలు పాడైనవి ఉండడంతో పాటు నాణ్యత లేని బెండకాయలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టను రద్దు చేయాలని అధికారులకు ఆదేశిస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.